క్లుప్తంగా

ములుగుపల్లిలో గ్రామసభ

మహాముత్తారం: మండలంలోని ములుగుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ దూలం మల్లయ్య అధ్యక్షతన బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో గ్రామంలో నిర్వహించాల్సిన అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానాలు చేశారు. అనంతరం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా 85సంవత్సరాలు నిండిన ఐదుగురు ఓటర్లను సన్మానించారు. ఉపసర్పంచ్ మీనా, వార్డు సభ్యులు సువర్ణ, వీరస్వామి, సమ్మయ్య, శ్రీనివాస్, రాజయ్య, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన

పలిమెల: మండలంలోని లెంకలగడ్డలోని నర్సరీ పనులను బుధవారం ఎంపీడీఓ ప్రకాష్ రెడ్డి, ఏపీఓ సునిత పరిశీలించారు. మొక్కల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

నియామకం



భూపాలపల్లి రూరల్: విశ్వ బ్రహ్మణ, విశ్వకర్మ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామగిరి సాంబమూర్తిని నియమించినట్లు ఆంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మండ్ల చారి బుధవారం ప్రకటనలో తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

కాటారం: భాషా పండితులకు తక్షణమే పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ పండిత జేఏసీ సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని ధన్వాడ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. భాషాపండితులు దశాబ్దాలుగా ఉన్నత పాఠశాలల్లో బోధిస్తూ శ్రమ దోపిడికి గురవుతున్నారని పదోన్నతి పొందకుండానే పదవి విరమణ పొందున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయుల పదోన్నతుల్లో షెడ్యూల్‌లో అప్‌గ్రేడ్ అయిన పోస్టులు చేర్చి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కిషన్‌నాయక్, సాంబశివుడు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

కాటారం: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక ప్రయోజనాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయభాస్కర్ అన్నారు. కాటారం మండలంకేంద్రంలోని రైతువేదికలో ఆయిల్‌పామ్ సాగు పై రైతులకు అవగాహన కల్పించారు. పంటకాలం, సాగు విధానం, సబ్సిడీ తదితర విషయాలను వివరించారు. మొదటి నాలుగేళ్లు అంతర్‌పంటలు సా గు చేసుకోవచ్చని, సబ్సిడీ ద్వారా డ్రిప్ సౌకర్యం కూడా అందజేయడం జరుగుతుందన్నారు. రైతులు సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలని, ప్రతి ఒక్కరు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి, రైతుబంధు సమితి కోఆర్డినేటర్ కుడుదుల రాజ బాబు, మండల వ్యవసాయాధికారి గిరి రామకృష్ణ, ఏఈఓలు రాజన్న, సరిత, రైతులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

పలిమెల: మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కురసం బుచ్చక్క అధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ఈ సమావేశానికి పలు శాఖ అధికారులు హాజరు కాగా, కొన్ని శాఖ అధికారుల గైర్హాజరై వారి స్థానంలో మరొకరిని సమావేశానికి పంపించారు. పలిమెల జెడ్పీటీసీ సభ్యురాలితోపాటు, ఎనిమిది మంది సర్పంచులకు ఏడుగురు గైర్హాజరు కావడంతో సమావేశం తూతూ మంత్రంగా కొనసాగింది. దీనికి స్థానిక ఎమ్మెల్యే హాజరుకానుండగా ఎమ్మెల్యే కూడా హాజరు కాకపోవడంతో అనుకున్న సమయానికన్న రెండు గంటలు ఆలస్యంగా సభ ప్రారంభమైంది. అయినప్పటికీ ప్రజాసమస్యలపై తూతూ మంత్రంగానే చర్చ జరిగింది. ఎంపీడీఓ ప్రకాష్‌రెడ్డి, తహసీల్దార్ స్రవంతి, ఎంపీటీసీ కళ్యాణి, పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో గుడిసెల ఏర్పాటు

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని పాత ఎర్ర చెరువు సమీపంలోని ప్రభుత్వ స్థలంలో బుధవారం సీపీఎం, సీపీఐల ఆధ్వర్యంలో వేర్వేరుగా భూ పోరాటాలను ప్రారంభించి గుడిసెలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్వే నెంబర్ 283, 284, 285లో చెట్లు, ముళ్ల పొదలను తొలగించి నిరుపేదలు గుడిసెలు వేస్తున్నారు. జిల్లా కేంద్రంలో వందలాది మంది నిరుపేదలు ఉండటానికి ఇళ్లు, కట్టుకొడానికి జాగ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, జిల్లా కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్నాయని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు ఆరోపించారు. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ పేద ప్రజలకు ఇంటి స్థలాలను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ పార్టీల నాయకులు కంపెట రాజయ్య, వెలిశెట్టి రాజయ్య, రమేష్, కుడుదుల వెంకటేష్, సోత్కు ప్రవీణ్, సతీష్, భగత్, జోసఫ్, పవన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు ఎంతో అమూల్యమైనది



కాటారం: ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్, సిబ్బంది

కాటారం: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో అమూల్యమైందని, సక్రమంగా వినియోగించుకోవాలని తహసీల్దార్ జీవాకర్‌రెడ్డి అన్నారు. జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంతో పాటు ఒడిపిలవంచ ప్రభుత్వ పాఠశాలలో ఓటర్ ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జీవాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ ఓటు ఓ ఆయుధం లాంటింది అని ఓటు ద్వారా ప్రజాస్వామ్యంలో అవినీతిరహిత పాలనను నిర్మించవచ్చని పేర్కొన్నారు. ప్రలోభాలకు గురై తమ ఓటు హక్కును దుర్వినియోగం చేసుకోవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ రామ్మోహన్, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, ఆర్ఐ వెంకన్న, ఒడిపిలవంచ పాఠశాల హెచ్ఎం గందు రాజబాబు, వీఆర్ఓల సంఘం కన్వీనర్ బందెల జితేందర్, పట్టి లక్ష్మణ్ పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలో 13వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేశారు. అలాగే మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరిడెంట్ సత్యనారాయణ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని ఎలాంటి ప్రలోభాలకు లోగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. నేటి సమాజంలో చాలా మంది ఓటును దుర్వినియోగ పరుస్తున్నారని, ఓటుకు చాలా శక్తి ఉందని పవిత్రమైనా ఓటును నిజాయితీతో ధైర్యంగా వినియోగించుకొని భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు.

ఓటు రాజ్యాంగం ఇచ్చిన హక్కు

పలిమెల: ఓటు రాజ్యాంగం ద్వారా వచ్చిన హక్కు అని, దాని ద్వారా ప్రజలు వారికి నచ్చిన పాలకులను ఎన్నుకునేందుకు వజ్రాయుధంలా ఉపయోగించుకోవాలని ఎస్సై అరుణ్ అన్నారు. బుధవారం జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని పంకేన కేజీబీవీ పాఠశాలలోని విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు క్రీడా పరికరాలను పంపిణీ చేశారు. క్రీడల్లో గొప్ప విజయాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ కనకలక్ష్మి, పోలీస్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మల్హర్: జాతీయ ఓటరు దినోత్సవం మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం తాడిచర్లలో తహసీల్దార్ కార్యాలయం, ఆయా గ్రామ పంచాయతీల్లో పంచాయతీ సిబ్బంది ఓటరు దినోత్సవ సందర్భంగా గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.



మొగుళ్లపల్లి: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో..



మల్హర్: తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో..



పలిమెల: క్రీడా కిట్లు పంపిణీ చేస్తున్న ఎస్సై అరుణ్

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ ఆడుతున్న సునీల్‌రెడ్డి



ఆటలో తలపడుతున్న క్రీడాకారులు

మల్హర్: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వం లభిస్తుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు చందుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాడిచర్ల గ్రామంలో అనసూయమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున క్రికెట్ టోర్నమెంట్‌ను సునిల్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. గ్రామీణా ప్రాంతంల్లో ఉన్న క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీయడం కోసమే ట్రస్ట్ ఆధ్వర్యంలో టోర్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ సెల్ కన్వీనర్ భీమరావు సంపత్, బీజేపీ మండల అధ్యక్షుడు మల్క మోహన్ రావు, మండల ప్రధాన కార్యదర్శి దేనవేన దేవేందర్, మైనార్టీ మండల అధ్యక్షుడు నిషాన్, యువ నాయకులు ప్రశాంత్, జీషాన్ పాల్గొన్నారు.

క్రీడలు ప్రారంభం

మహాముత్తారం: మండలంలోని నల్లగుంట మీనాజీపేటలో చందుపట్ల అనసూయమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో 5మండలాల కబడ్డీ క్రీడలు నిర్వహించారు. ఈ క్రీడలను మహాముత్తారం బీజేపీ మండల అధ్యక్షుడు సంపత్ బుధవారం ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలప్రదాన కార్యదర్శి బండ శ్రీకాంత్, బీజేపీ నాయకులు శ్రీకాంత్, ప్రశాంత్, రాజెందర్, కిషోర, సురేష్, లక్ష్మన్ వివిద గ్రామాలకు చెందిన కబడ్డీ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

అరిగోస దీక్షను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మంద కుమార్ మాదిగ

టేకుమట్ల: ఈ నెల 30న హైదరాబాద్‌లోని ఇంద్ర పార్కు ధర్నా చౌక్ వద్ద జరిగే అనాథ పిల్లల అరిగోస దీక్షను విజయవంతం చేయాలని ఎమ్మెస్పీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంద కుమార్ మాదిగ కోరారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనాథ పిల్లల హక్కుల సాధన కోసం జరిగే పోరాటంలో మానవతావాదులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ గతంలో అనాథలకు ప్రభుత్వమే తల్లిదండ్రులని చెప్పుకోవడమే కాకుండా వారికి రెసిడెన్షియల్ పాఠశాలలు కట్టిస్తామని చెప్పిన హామీని నిలబెట్టుకోలేదన్నారు. కావున దీక్షకు ప్రతి ఒక్కరూ రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి మాదిగ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాజుల బిక్షపతి, ఇంజంపల్లి ప్రవీణ్, రేణుకుంట్ల సంపత్, మండల నాయకులు రామ్‌చందర్, ఎలుకటి నర్సయ్య, సారయ్య, సరోత్తం తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్సై శ్రీధర్

మొగుళ్లపల్లి: సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామాల్లో నేరాలను నియంత్రించవచ్చని ఎస్సై శ్రీధర్ అన్నారు. మండలంలోని ఎల్లారెడ్డిపల్లె ప్రజల సహకారంతో ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాల ప్రారంభోత్సవానికి బుధవారం ఎస్సై శ్రీధర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా నేరాల సంఖ్య తగ్గుతుందన్నారు. గ్రామాల్లో దొంగతనాలు, దోపిడీలు పోకిరీల ఆటలు సాగవన్నారు. దొంగతనాలు జరుగకుండా ఉండడం కోసమే సీసీ కెమెరాలని, నేరం చేసిన వారిని సులభంగా గుర్తించేందుకు సీసీ కెమెరాలు దోహదపడతాయన్నారు. నిందితులు నిఘా నేత్రం నుంచి తప్పించుకోలేరని, ఒక్కో సీసీ కెమెరాలు వంద మంది పోలీసులతో సమానం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీధర్, సర్పంచ్ పెంతల రాజేందర్, ఎంపీటీసీ దండ వెంకటేశ్వర్ రెడ్డి, ఉప సర్పంచ్ నాగరాజు, సుమన్, గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

చిన్నతూండ్లలో గ్రామసభ



బడ్జెట్ ప్రాధాన్యతను వివరిస్తున్న కార్యదర్శి సమ్మరాజు

మల్హర్: మండలంలోని చిన్నతూండ్ల గ్రామంలో సర్పంచ్ పులిగంటి మమత ఆధ్వర్యంలో అభివృద్ధి ప్రణాళిక రూపొందించుట బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2023–24 ఆర్థిక సంవత్సారానికి గ్రామ పంచాయతీకి కేటాయించిన బడ్జెట్ నుంచి కల్పించాల్సిన మౌలిక సదుపాయలకు సంబంధించిన క్యాపటిల్ వర్క్స్, పారిశుద్ధ్య పనులు, తాగు నీటి నిర్వహణ, ఇతర గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులకు వాటి ప్రాధాన్యత క్రమంలో బడ్జెట్ కేటాయిస్తు గ్రామస్తుల సమక్షంలో ప్రణాళిక తయారు చేశారు. అనంతరం 100 మంది అయుష్మాన్ భారత్ కార్డు లబ్ధిదారులకు ఈకేవైసీ పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యాదర్శి సమ్మరాజు, ఉపసర్పంచ్ బబ్బిలి సురేష్, వార్డు సభ్యులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ఫిల్డ్ అసిస్టెంట్‌లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా గ్రామసభలు



మాట్లాడుతున్న జూకల్ సర్పంచ్ మహేందర్

చిట్యాల: గ్రామాల అభివృద్ధి కోసమే రాష్ట్ర ప్రభుత్వం గ్రామసభలు ఏర్పాటు చేసుకోవాలని సూచించిందని జూకల్ సర్పంచ్ పుట్టపాక మహేందర్, గోపాలపూర్ సర్పంచ్ దుప్పటి రజిత అన్నారు. ఈ సందర్భంగా బుధవారం జూకల్, గోపాలపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. గ్రామసభల్లో సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్లాన్ జీపీడీపీ 2023–24 సంబంధించిన గ్రామసభలను నిర్వహించి గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులపై ప్రణాళికలను తయారు చేసినట్లు వారు పేర్కొన్నారు. గ్రామసభలో గ్రామాల అభివృద్ధిపై, ఓటరు దినోత్సవ సందర్భంగా గ్రామ ప్రజలకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు దేవేందర్‌రెడ్డి, రవీందర్, అంగన్‌వాడీ టీచర్లు శ్రీదేవి, జ్యోతి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన దిగుబడులు సాధించాలి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

మొగుళ్లపల్లి: మండలంలోని రంగాపురం గ్రామంలోని రైతు వేదికలో మిరప, పంటలో నాణ్యమైన దిగుబడులు సాధించడానికి స్పైసిస్ బోర్డు ప్రాంతీయ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ విజిష్ట బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిరప పంటలో అధిక మోతాదులో రసాయనాలు వాడడంతో తక్కువ ప్రమాణాలు గల దిగుబడులు వస్తున్నాయన్నారు. ఎరువులు, పురుగు మందులు వాడినప్పటికి నియంత్రించిన మోతాదులో ఉపయోగించడంతో నాణ్యత ప్రమాణాలు గల పంట దిగుబడిని పొందవచ్చునన్నారు. మిరపలో సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించడం వల్ల చీడల ఉధృతిని తగ్గించుకోవచ్చన్నారు. పసుపు, మిరప పంటలను భూసార పరీక్ష చేయించిన తర్వాతనే ఎరువులు తగిన మోతాదులో వేయాలన్నారు. అనంతరం రైతుల పంటలను పరిశీలించి నాణ్యతకు సంబంధించి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త అనిల్, ఎంపీపీ యార సుజాతసంజీవరెడ్డి, సర్పంచ్ బల్గూరి తిరుపతిరావు, జెడ్పీటీసీ జోరుక సదయ్య, వైస్ ఎంపీపీ పోల్నేని రాజేశ్వర్‌రావు, మండల వ్యవసాయాధికారి సురేందర్‌రెడ్డి, ఏఈఓ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణకే 'కంటి వెలుగు'

● ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

చిట్యాల: నిరుపేదల కోసమే సీఎం కేసీఆర్ కంటివెలుగు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని చింతకుంట రామయ్య పల్లి గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని కేసీఆర్ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. కంటివెలుగు శిబిరంలో కంటి పరీక్షలు చేసుకుని తగిన శస్త్ర చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దావు వినోద, జెడ్పీటీసీ గొర్రె సాగర్, మండల స్పెషల్ అఫీసర్ శైలజ, ఎంపీడీఓ రామయ్య, తహసీల్దార్ సమ్మయ్య, డాక్టర్ మౌనిక, ఏపీఎం మంజుల, సీసీ లలిత, ఎంపీఓ రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ క్రాంతి కుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఎరుకోండ గణపతి, సర్పంచ్ ముకిరాల మధువంశీ కృష్ణ, ఆరెపల్లి మల్లయ్య, సంపత్, రవీందర్‌రావు, వీరారెడ్డి, స్వామి, రవీందర్‌గౌడ్, రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎంపీపీ

పలిమెల : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ వద్ద మండలంలోని 14 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఎంపీపీ బుచ్చక్క బుధవారం చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కల్యాణి, ఎంపీడీఓ ప్రకాష్‌రెడ్డి, తహసీల్దార్ ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో కరాటే శిక్షణ

కాళేశ్వరం: డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, ఎక్స్ అఫిషియో స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్ష తెలంగాణ వారి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో బాలికలకు రెండు నెలల పాటు కరాటే శిక్షణ ఇవ్వడానికి జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం కాళేశ్వరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు కరాటే శిక్షణను హెచ్ఎం మణిమాల ఆధ్వర్యంలో ఇన్‌స్ట్రక్టర్ కూపరాటి మహేష్ ప్రారంభించారు. రెండు నెలల పాటు బాలికలకు కరాటే శిక్షణ ఇవ్వనున్నారు. బాలికలు కరాటే ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందని ఇన్‌స్ట్రక్టర్ తెలిపారు. రెండు నెలలకు కరాటే ఇన్‌స్ట్రక్టర్‌కు నెలకు ఒక్కటికి రూ. 5వేల చొప్పున జీతం అందజేయనున్నారు. జిల్లాలోని పాఠశాలల్లో కూడా కరాటే శిక్షణ ప్రారంభిస్తున్నట్లు తెలిసింది.

చిడతల రామాయణం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అన్నారం గ్రామస్తులు నిర్వహిస్తున్న చిడతల రామాయణం కార్యక్రమానికి పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ మంగళవారం రాత్రి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంపీపీ రాణిబాయి, సర్పంచ్ శ్రీపతి బాపు, ఎంపీటీసీ దుర్గయ్య, నాయకులు గీతాబాయ్, రాజబాపు, శ్రీనివాస్, శేఖర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మోహన్‌రెడ్డి, నాగరాజు ఉన్నారు.

పరామర్శ

మహాముత్తారం: మండలంలోని బోర్లగూడెం గ్రామానికి చెందిన బోడ హట్యానాయక్ మూడు రోజులక్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. అతని కుటుంబసభ్యులను బుధవారం మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు పరామర్శించి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. శ్రీధర్‌బాబు వెంట మాజీ సర్పంచ్ మంగూనాయక్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఇనుగొండ వెంకట్‌రెడ్డి, వంశీరాజ్, రాజునాయక్ తదితరులు ఉన్నారు.

సంక్షోభంలోకి సింగరేణి



సమావేశంలో మాట్లాడుతున్న మాధవనాయక్

భూపాలపల్లి అర్బన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థను సంక్షోభంలోకి తీసుకెళ్తుందని బీఎంఎస్ జాతీయ కార్యదర్శి, జేబీసీసీఐ సభ్యుడు మాధవనాయక్ ఆరోపించారు. భూపాలపల్లి ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిపోయిందన్నారు. కార్మికులు చెమట చుక్కలు దారపోసి సాధించిన సొమ్మును రాబందుల్లా తన్నుకుపోతున్నారని ఆరోపించారు. సింగరేణి ప్రభవిత గ్రామాల్లో ఖర్చు చేయాల్సిన డీఎంఎఫ్‌టీ, సీఎస్ఆర్ నిధులను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని తెలిపారు. సింగరేణి సంస్థకు రావాల్సిన రూ.25వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో సింగరేణి బ్యాంకుల వద్ద రూ.10వేల కోట్లు అప్పులు చేయాల్సి వచ్చిందన్నారు. దీంతో సంస్థ పూర్తిగా నష్టాలోకి వెళ్తుందన్నారు. స్థానికంగా రూ.2కోట్ల నిధులతో ఎమ్మెల్యే తన నివాసంతో స్విమ్మింగ్‌పూల్ నిర్మించుకునేందుకు సీఎస్ఆర్ నిధులను కేటాయించుకోవడం శోచనీయమన్నారు. సింగరేణి సంస్థను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయలేదని ప్రైవేట్ కంపెనీలకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. యూపీఏ ప్రభుత్వం రెండో సారి అధికారంలో ఉన్నప్పుడే 218 బ్లాక్‌లను ప్రైవేట్‌పరం చేసిందన్నారు. బ్లాక్‌ల కొనుగోళ్లలో రూ. 186 వేల కోట్ల అక్రమాలు చోటుచే సుకోగా 2014లో వాటిని రద్దు చేయడం జరిగిందన్నారు. 2019వ వరకు పెండింగ్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. ఆయా రాష్టలో అవసరమన్న ప్రభుత్వాలు వారి ఆధీనంలోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఐదేళ్ల పాటు ప్రభుత్వం, సింగరేణి యాజ మాన్యం ముందుకు రాకపోవడంతో టెండర్లకు పిలిచినట్లు తెలిపారు. తెలంగాణలోని బ్లాక్‌లను వదిలి ఓడిషా రాష్ట్రంలో నైని బ్లాక్‌ను సింగరేణి సంస్థ ఏవిధంగా తీసుకుందని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే తాడిచెర్ల బ్లాక్‌ను ప్రైవేట్‌కు ఇచ్చారని, భూగర్భ గనులతో పాటు, ఓపెన్ కాస్టుల్లో కూడా ప్రైవేట్ వ్యక్తులతో ఉత్పత్తి చేపిస్తున్నారని ఆరోపించారు. కోల్ ఇండియాలో రోజుకు రూ.930 వేతనాలు చెల్లిస్తుంటే సింగరేణి రోజుకు రూ.430 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. భూపాలపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఇటీవల టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కార్మికులకు మోసపూరిత మాటాలు చెప్పిందన్నారు. సమావేశంలో పవన్‌కుమార్, అప్పాని శ్రీనివాస్, సుజేందర్, శంకర్, శ్రీనివాస్, నారాయణ, రాజు, శ్రీనివాస్, జనార్ధన్, లక్ష్మణ్, మధుకర్ పాల్గొన్నారు.

బీసీలకు అవకాశం కల్పించాలి

కాటారం: కాళేశ్వరం దేవస్థానం చైర్మన్‌గా బీసీ వర్గానికి చెందిన అట్టెం రమేశ్‌ముదిరాజ్‌కు అవకాశం కల్పించాలని కాటారం మండలం దేవరాంపల్లి మత్స్యశాఖ అధ్యక్షుడు తూటి మనోహర్, ముదిరాజ్ సంఘం నాయకులు ఒక ప్రకటనలో కోరారు. రమేశ్ 2007 సంవత్సరం నుంచి టీఆర్ఎస్ పార్టీలో పని చేస్తూ మంథని నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పుట్ట మధు గెలుపు కోసం తీవ్రంగా కృషి చేశారని పేర్కొన్నారు. బీసీ బిడ్డ రమేశ్‌కు చైర్మన్‌గా అవకాశం ఇవ్వాలని సూచించారు.

పట్టర పట్టు.. గట్టిగ పట్టు!

● మొరాయించిన ఆర్టీసీ బస్సు



బస్సును తోస్తున్న ప్రయాణికులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం బస్టాండ్‌లో మంచిర్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మొరాయించింది. బుధవారం కాళేశ్వరం ప్రయాణికులతో వచ్చి మళ్ళీ తిరిగి వెళ్లేందుకు డ్రైవర్ స్టార్ట్ చేయగా సెల్ఫ్ పని చేయలేదు. దీంతో అందులోని ప్రయాణికులు దిగి బస్సును తోశారు. ఎట్టర.. పట్టు అంటూ బస్సును తోయడంతో స్టార్ట్ అయింది. కండీషన్‌లో లేని బస్సులు ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్న అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు.